



గురుకులాల్లో దళారుల దందా

- ఎస్సీ, బీసీ గురుకులాల్లో సీట్లు రాని వారికి గాలం
- మైనార్టీ గురుకులాల్లో చేర్పించేందుకు యత్నాలు
- ప్రవేశాలు కల్పించేందుకు డబ్బు వసూలు?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పలు ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో దళారులు ప్రవేశించి అడ్మిషన్ల దందా చేస్తున్నారని తెలుస్తున్నది. ఆయా గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు ప్రవేశాలకు సంబంధించి ఉన్న నిబంధనల లొసుగులను ఆధారం చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసి వారి పిల్లలను గురుకులాల్లో చేర్పిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో సాగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఎస్సీ, బీసీ గురుకులాల్లో సీట్లు రాని వారికి దళారులు గాలం వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల విద్యాలయాలకు సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. వారికి వచ్చే మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులు ముందుగా సూచించిన నాలుగైదు గురుకులాల్లో మార్కులను బట్టి ఆ విద్యాలయాన్ని కేటాయిస్తారు. ప్రవేశాలు పొందిన తర్వాత ఎవరైనా డ్రాపవుట్ అయితే ఆ తర్వాత మెరిట్‌లో ఉన్నవారికి అవకాశం కల్పిస్తున్నారు. ఇలా రెండు, మూడు జాబితాలు పూర్తయిన తర్వాత కూడా ఎక్కడైనా సీట్లు మిగిలితే వాటిని భర్తీ చేసే అవకాశం ఎక్కడైతే ఖాళీలు ఉన్నాయో ఆ ప్రిన్సిపాళ్లకు అధికారం అప్పగిస్తున్నారు. వాళ్లు ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థులకే సీట్లు ఇస్తుండగా, అక్కడక్కడ పైరవీలు చేసే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలుస్తున్నది.

● రూ.30-40 వేల వరకు వసూలు..

మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల తీరు మరోరకంగా ఉంది. ప్రతి పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ఇందులో మైనార్టీలకు 51 సీట్లు, క్రిస్టియన్లకు 5 సీట్లు, బీసీలకు 10 సీట్లు, ఎస్సీలకు 3 సీట్లు, ఎస్టీలకు 3 సీట్లు, సిక్కులు, పార్శీలు, జైనులు, బుద్ధిస్టులకు 8 సీట్లు కేటాయించారు. ఈ సీట్ల భర్తీ కోసం ఆయా పాఠశాలల్లో నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇక్కడ ప్రవేశాల కోసం ఎలాంటి ప్రవేశ పరీక్షలు నిర్వహించడం లేదు. కోటా నిండడమే లక్ష్యంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. మొదట ప్రవేశ పరీక్ష నిర్వహించినప్పటికీ, పెద్దగా స్పందన లేక సీట్లు నిండ లేదు. ఇప్పుడు నేరుగా కోటా ప్రకారం ప్రవేశాలు కల్పిస్తున్నారు. జూలైలోపు మొత్తం సీట్లు భర్తీ కావడం లేదు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన సీట్లు మినహా, మైనార్టీలు, ఇతరులకు కేటాయించిన సీట్లు నిండడం లేదు. దీంతో ఆ సీట్లను ఎస్సీ, ఎస్టీలు, బీసీలతో భర్తీ చేసేందుకు గత ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనిని ఆసరా చేసుకుని కొంత మంది దళారులు ఇతర గురుకుల్లో సీట్లు రాని విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి వారి వద్ద నుంచి 30నుంచి 40వేల వరకు డబ్బులు వసూలు చేసి మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులను చేర్పిస్తున్నట్లు సమాచారం.

జిల్లాలోని ఒక గురుకుల పాఠశాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని ఒక గురుకుల పాఠశాలలో ఈ రకమైన ప్రవేశాలు కల్పిస్తున్నారని తెలుస్తున్నది. ఈ రెండు గురుకులాలకు జిల్లాకు చెందిన విద్యార్థులనే పంపిస్తున్నారు. ప్రభుత్వ గురుకులాల్లో ఉచితంగా విద్యాభ్యాసం చేస్తున్నప్పటికీ, తల్లిదండ్రుల బలహీనతలను ఆసరా చేసుకుని దళారులు డబ్బులు తీసుకుని సంబంధిత పాఠశాల సిబ్బందికి కొంత ఇచ్చి, వాళ్లు కొంత తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ విద్యా సంవత్సరానికి ఎస్సీ, బీసీ గురుకులాల్లో ప్రవేశాలు పూర్తి కాగా, అందులో సీట్లు రాని వాళ్లను మైనార్టీ గురుకులాల్లో చేర్పించేందుకు రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించి మెరిట్‌ను ఆధారంగా కేటాయించాలని విద్యార్థుల తల్లితండ్రులు అభిప్రాయపడుతున్నారు.

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య

- సుల్తానాబాద్ రైసుమిల్లుల ప్రాంతంలో ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు
- పోలీసుల అదుపులో నిందితుడు

- 7లో..

చిన్నారి హత్యాచార ఘటనపై నిరసనలు

- కొవ్వొత్తులతో నివాళులర్పించిన మహిళలు
- న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాల ధర్నా



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సుల్తానాబాద్, జూన్ 14: సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారి హత్యాచార ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని, మిల్లులో కార్మిక కుటుంబాల మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక గాంధీనగర్ వద్ద గల గాంధీ విగ్రహం ఎదుట మహిళలు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీగా వచ్చి చిన్నారికి నివాళులర్పించారు. కాగా అంతకుముందు పలు ప్రజా సంఘాల నాయకులు చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా చేశారు. తెలంగాణ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఘటనను పెద్దపల్లి గడ్డం వంశీకృష్ణ ఒక ప్రకటనలో ఖండించారు.

పుట్ట శైలజ ఎన్నిక చెల్లదంటూ కోర్టు తీర్పు

మంథని, జూన్ 14: మంథని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కౌన్సిలర్‌గా ఎన్నికల చెల్లదంటూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఆమె ఎన్నికల ప్రత్యర్థి, పిటిషనర్ అయేషా ఫాతిమా శుక్రవారం తెలిపారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక 2వ వార్డు నుంచి పుట్ట శైలజ పోటీ చేసిన క్రమంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించారని, పుట్ట శైలజను ఎన్నికలలో పోటీ చేయుటకు తిరస్కరించాలని ఆమె ప్రత్యర్థి అయిన అయేషా ఫాతిమా కరీంనగర్ జిల్లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. గట్టు వామన్‌రావు దంపతుల హత్యల అనంతరం కరీంనగర్ జిల్లా ట్రిబ్యునల్ నుండి ఈ కేసును రంగారెడ్డి జిల్లా కోర్టుకి బదిలీ చేశారు. ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ పర్యవేక్షణలో ఈ కేసును విచారించిన న్యాయస్థానం సుదీర్ఘ సమయం తీసుకుని పుట్ట శైలజను కౌన్సిలర్‌గా అనర్హులుగా ప్రకటించి సంచలన తీర్పునిచ్చారు.

స్పోర్ట్స్ మీట్‌లో రామగుండం ఎన్టీపీసీకి రెండో స్థానం

జ్యోతినగర్, జూన్ 14 : విశాఖపట్నం సింహాద్రి ఎన్టీపీసీలో రెండు రోజులపాటు జరిగిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్(ఎస్ఆర్ఎస్ఎం)లో రామగుండం ప్రాజెక్టు మహిళల త్రోబాల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలలో దక్షిణాదిలోని రామగుండం ఎన్టీపీసీతోపాటు సింహాద్రి(ఏపీ), కాయంకుళం(కేరళ), కుడిగి(కర్నాటక), ఎస్ఆర్‌హెచ్‌క్యూ) ప్రాజెక్టులకు చెందిన జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం సింహాద్రి ఎన్టీపీసీ, రామగుండం ఎన్టీపీసీ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో రామగుండం రెండో స్థానంలో నిలిచింది. రన్నరప్‌గా నిలిచిన మహిళల జట్టును స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి భానేశ్వర్, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగుల పంపిణీ

ఎలిగేడు, జూన్ 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కిడ్స్ ఫర్‌కిడ్స్ ఇండియా ఎన్జీవో వారి సహకారంతో అర్షనపల్లి యువి నేతృత్వంలో పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగులను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ అర్షనపల్లి శ్రీవాణిశ్రీనివాస్‌రావు, యువి, సామ రాజేశ్వర్ రెడ్డి, ఎంఈవో కవిత, హెచ్‌ఎంలు గంగ్ర దేవేందర్‌రావు, నరేంద్రచారి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ రేఖ, మాజీ సర్పంచ్‌లు గోపాలురావు, వెంకటేశ్వర్‌రావు, రాజనర్సు, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



రేగడిమద్దికుంటలో మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

సుల్తానాబాద్, జూన్ 14: మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో మట్టి టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. రేగడి మద్దికుంట చెరువు నుంచి ప్రతీ రోజు పెద్ద ఎత్తున టిప్పర్లలలో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. తమ చెరువుకట్ట మరమ్మతులకు మట్టి పోయమంటే పోయకుండా గ్రామం నుంచి రోజా సుద్దాల సుల్తానాబాద్ రోడ్డు పనులకు పేరిట తరలిస్తున్నారని గురువారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. ఐదు టిప్పర్లలో మట్టి నింపుకుని వెళుతుండగా వాటిని గ్రామచౌరస్తా వద్దకు తీసుకువచ్చారు. గురువారం ఉదయం సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి గ్రామ చెరువు కట్ట మరమ్మతులకు మట్టిని పోయాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగిల్‌విండో చైర్మన్ గడ్డం మహిపాల్‌రెడ్డి, నోముల రాజిరెడ్డి, కొమురయ్య, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి రూరల్, జూన్ 14: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డులకు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో డి.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో 5 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు ఇతరుల కోసం అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి సైన్స్ టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభచూపిన బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి శుభాకాంక్షలు

పెద్దపల్లి రూరల్, జూన్ 14 : టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్ హుస్సేన్‌ని జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు బొంకూరి శంకర్, సందీప్ రావులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

- గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపరింటెండెంట్

కళ్యాణ్‌నగర్, జూన్ 14:యువకులు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలువాలని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ సింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన 12మంది రక్తదాతలను ఆయన అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చాలా మంది సమయానికి రక్తం అందక మృతిచెందుతుతున్నారని, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కూడా చాలా రోడ్డు ప్రమాదాలు జరిగి సరైన సమయంలో రక్తం అందడం లేదన్నారు. రక్తదానం చేసే దాతలు ముందుకు వస్తే ఎప్పటికీ బ్లడ్ బ్యాంకులో రక్తాన్ని నిల్వ చేసుకోవచ్చని, ప్రతి ఒక్క యువకుడు రక్తాన్ని దానం చేయడానికి ముందుకు రావాలని, ప్రతి ఆరు నెలలకోసారి రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సంపత్, అక్బర్, నర్సింగ్ సిబ్బంది కీర్తన, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సార్లు రక్తదానం చేసిన క్రాంతికుమార్‌కు అవార్డు



పోతరవేన క్రాంతికుమార్

మంథని, జూన్ 14: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు మంథనికి చెందిన వారు పోతరవేన క్రాంతి కుమార్‌కు అత్యధిక రక్తదానం చేసిన దాత అవార్డును ప్రదానంచేశారు. వివిధ సందర్భాల్లో క్రాంతి కుమార్ 49సార్లు రక్తదానం చేసినందుకు గవర్నర్ ద్వారా హయ్యేస్ట్ బ్లడ్ డోనర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ తనకు అవార్డు పొందడానికి ప్రోత్సహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, వైస్ చైర్మన్‌తూము రవీందర్, ఎంసీ మెంబర్ మేడగొని వెంకటేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

అవార్డు పొందిన క్రాంతి కుమార్‌ను రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కావేటి రాజగోపాల్, వైస్ చైర్మన్ తూము రవీందర్, మేడగోని వెంకటేష్, మంథని వాసులు అభినందించారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి రూరల్, జూన్ 14 : కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాకు చెందిన విద్యార్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో జిల్లా నుంచి కరాటే పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌రాజ్‌ఠాకూర్, అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీలతో కలిసి అభినందించారు. గతనెల 19న గోవాలోనీ మనోహర్ పారీకర్ ఇండోర్ స్టేడియంలో యూనివర్సల్ 369 షోటోకాన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ 2024 పోటీలలో కాల్వశ్రీరాంపూర్ మండలం జడ్పీహెచ్ఎస్ వెన్నంపల్లి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిహెచ్.వైష్ణవి, నిహారిక, ఈ.శ్రీనిత, ఈ.శ్రీహర్షిని, పదో తరగతి చదువుతున్న నిదర్శిని పాల్గొని కాటా విభాగంలో నాలుగు బంగారు పతకాలు, ఆయుధ కాటా విభాగంలో ఒక వెండి, ఒక కాంస్య పతకాలను సాధించగా, వారిని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ లు అభినందించారు. అదేవిధంగా రామగుండం లోని సాక్రెడ్ హార్ట్ హై స్కూల్‌కు చెందిన అమృత్ సాయి అనే విద్యార్థి మలేషియాలో నిర్వహించిన పదో అంతర్జాతీయ ఓకినావా గోజుర్యు ఎపోసిటి కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొని అండర్ 16 క్యాటగిరిలో బంగారు పతకం, వెటరన్ క్యాటగిరిలో వెండి పతకం సాధించగా సదరు విద్యార్థిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కే.శ్రీనివాస్, కరాటే మాస్టర్ కాల్వ రమేష్, కరాటే డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే ఓపెన్ జిమ్ : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జూన్ 14: రామగుండంలో రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి ఆరోగ్యం కోసం ఇచ్చిన మాట ప్రకారం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌షింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. శుక్రవారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రూ.15లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వాకర్స్‌కు, యువకులకు, సీనియర్ సిటీజన్లకు ఇచ్చిన మాట ప్రకారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి, అంతర్గాం, రామగుండంలో జిమ్‌లను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఇండోర్ జిమ్‌లో మరికొన్ని వస్తువులు ఏర్పాటు చేయాలని కోరడంతో అందులో వస్తువులను ఏర్పాటు చేయడానికి సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో మాట్లాడి ఆ వస్తువులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువకులు క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, ఎండీ ముస్తాఫా, బాల రాజ్‌కుమార్, నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, దూళికట్ట సతీష్, పాతిపెల్లి ఎల్లయ్య, కళ్యాణి సింహాచలం, అడ్డాల రామస్వామి, వాకర్స్ పూర్ణ శ్రీనివాస్, రఘు, కోట రవి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్ మాచిడి మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

య్రైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివరాత్రి సమ్మయ్య(42) గురువారం రాత్రి మృతి చెందాడు. కాలనీ షిర్కే సులభ్ కాంప్లెక్స్ కార్మికుడిగా పనిచేస్తున్న సమ్మయ్య ఆర్థిక ఇబ్బందులను మానసిక క్షోభతో మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకోవాలని సులబ్ కాంప్లెక్స్ శుభ్రతకు వాడే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 సాయంతో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందతూ గురువారం రాత్రి సమ్మయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్స్‌లో రెవెన్యూ అధికారుల తనిఖీ

- 14 డొమెస్టిక్ సిలిండర్లు పట్టివేత

ధర్మపురి, జూన్ 14: ధర్మపురి పట్టణంలోని పలు హోటల్స్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, రాజేంద్రప్రసాద్, మల్యాల డీటీసీఎస్ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్ యజమానుల వద్ద నుంచి 14 డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్నారు. అనంతరం డొమెస్టిక్ సిలిండర్లు కలిగి ఉన్న యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం ఆర్ఐ వెంకటేష్ మాట్లాడుతూ సబ్సిడీపై గృహ అవసరాలకు ఇచ్చే సిలిండర్లను వాణిజ్యపరమైన అవసరాలకు వినియోగించడం నేరమని అన్నారు. వాణిజ్య అవసరాలకు ప్రత్యేకమైన సబ్సిడీ లేని సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల నుంచి తీసుకొని వాడుకోవాలని హోటల్ నిర్వాహకులకు ఆయన సూచించారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

- సూసైడ్ నోట్ లభ్యం

ఇబ్రహీంపట్నం, జూన్ 14: అప్పు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాయించుకుని నిరంతరం వేధింపులకు పాల్పడటంతో భరించలేక మండల కేంద్రానికి చెందిన సున్నం రవి (42) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో రవి జేబులో లభ్యమైన సుసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నంకు చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి రవికి రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బెదిరించి కొట్టి సంతకం తీసుకున్నాడు. అదే విధంగా గ్రామానికి చెందిన కనక జగన్, చెప్పుల శ్రీనివాస్, గంట గణేష్‌లు రవి వద్ద అప్పులు తీసుకుని చెల్లించడం లేదు. డబ్బులు అడిగినప్పుడల్లా చంపుతామంటూ రవిని బెదిరిస్తూ వస్తున్నారు. ఓ వైపు రవి ఇప్పుగా ఇచ్చిన డబ్బులు రాకపోవడం, మరోవైపు అప్పు తీసుకోకున్నా డబ్బులు చెల్లించాలంటూ రాజేందర్ నుంచి వేధింపులు పెరగడంతో రవి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో చేసేది లేక చివరికి సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. రవికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదం నిండుకుంది. రవి మృతికి కారుకులైన వారి చట్టపరంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళుతున్న ఐదుగురు విద్యార్థులపై రెండు కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటనలో విద్యార్థులు వర్ష, రమేశ్, ప్రవళికతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. అక్కడే ఉన్న వ్యక్తులు అప్రమత్తమై కుక్కలను కర్రలతో వెళ్లగొట్టడంతో పారిపోయాయి. క్షతగాత్రులను స్థానిక ఓ పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల బారి నుంచి తమతో పాటు పిల్లలను రక్షించాలని తల్లిదండ్రులు కోరారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

- యువకుడి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


అజయ్(ఫైల్)

రుద్రంగి, జూన్ 14: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి ఈ సంఘటన రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలిగోట తండా మూలమాలుపు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన బిల్లవేణి (గండి) గంగాధర్ - రాయమల్లు దంపతుల కుమారుడు గండి అజయ్(19) అనే యువకుడు, ఇదే గ్రామానికి చెందిన బోయిని అభిషేక్ అనే యువకుడితో కలిసి కథలాపూర్ మండలానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి రుద్రంగి వస్తున్న సమయంలో రుద్రంగి శివారులోని కలిగోట తండా మూలమాలుపు వద్ద రుద్రంగి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్ నడుపుతున్న బోయిని అభిషేక్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల కూర్చున్న గండి ఆజేయ్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన అభిషేక్‌ను చికిత్స కోసం వేములవాడ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

● బోనాల పండగ పూట విషాదం..

పెద్దమ్మ బోనాల పండగ పూట ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పండగ పూట పని నిమిత్తం వెళ్లిన యువకులు తిరిగి వస్తున్న క్రమంలో రుద్రంగి శివారులో మూలమాలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పండగ పూట సంతోషంగా ఉండాల్సిక కుటుంబం ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం, చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆర్టీసీ బస్సు.. వ్యాన్ ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులో ఆర్టీసీ బస్సు, వ్యాన్ శుక్రవారం ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరబాద్ నుంచి సుమారు 20 మంది ప్రయాణికులతో వేములవాడకు వెళ్తుండగా నేరెళ్ల శివారులో ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మక్బుల్ (55), సిరిసిల్లకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇంద్రసేనారెడ్డి (46), బస్సులో ప్రయాణికులు కథలాపూర్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన వైశాలి (18), గంభీరావుపేటకు చెందిన శశాంక్ (33), వేములవాడకు చెందిన పుల్కం లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా నేరెళ్ల శివారులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్దకు సుమారు 20 మంది ప్రయాణికులతో బస్సు చేరుకోగానే అతివేగంగా ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టడంతో సుమారు యాభై మీటర్ల వరకు బస్సును నెట్టుకుంటూ వెళ్లగా చెట్టును ఢీకొట్టి ఆగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చెట్టును ఢీకొని బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పిందని లేకుంటే బస్సు బోల్తా పడేదని సత్యనారాయణ అనే ప్రయాణికుడు తెలిపాడు. సంఘటన స్థలానికి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● తరుచూ ప్రమాదాలు..

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపులు చాలా ఉన్నాయి. మూలమలుపుల్లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదకరమైన మూల మలుపులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. మూలమలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు అందజేస్తున్న సీపీ అభిషేక్ మోహంతి

కరీంనగర్ క్రైం, జూన్ 14 సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యులు తిక్క సుశ్మిత అలియాస్ చైతె, మడకం దూల అలియస్ దూల శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. వీరిద్దరు దంపతులు. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి కరీంనగర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సెంట్రల్ కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి వద్ద సుశ్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా, దూల ప్రొటక్షన్ టీం మెంబర్‌గా పని చేశాడని సీపీ తెలిపారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుశ్మిత(27) ఇంటర్మీడియేట్ వరకు చదువుకుంది. ఆమె తండ్రి తిక్క సుదాకర్ మావోయిస్టు సానుభూతి పరుడిగా పనిచేశాడు. తండ్రిని చూసి మావోయిస్టు పార్టీకి ఆకర్షితులరాలైన సుశ్మిత తన చదువు అనంతరం 2016వ సంవత్సరంలో చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కొమటిపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో బడె చొక్కారావు అలీయాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారు. చత్తీస్‌గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా పర్య గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆయన సోదరుడు ఐయేత 2008లో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. అతడిని చూసి ఆకర్షితుడైన దూల 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో చేస్తున్న సమయంలో సుశ్మిత, దూలల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి30న వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులై లొంగిపోయారని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు ఉందని చెప్పారు. ఆ మొత్తాన్ని మావోయిస్టు దంపతులకు సీపీ బ్యాంకు డీడీ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు అజ్ఞాతం వీడి, హింసను వదిలి పెట్టి సమాజంలో కలిసిపోయి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి తిరుమల్, హసన్‌పర్తి సీఐ జె సురేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, జూన్ 14: మండలంలోని బూజూనూర్ గ్రామ శివారులో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ శుక్రవారం తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇల్లందకుంట మండలంలోని బూజూనూర్ గ్రామం గుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మల్యాల, జూన్ 14: మండలంలోని కొండగట్టు, బల్వంతాపూర్ శివారులో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్ రహీం శుక్రవారం తెలిపారు. వాహనాల యజమానులు మురళి, రవీందర్ డ్రైవర్లు కోను మహేష్, శివరాత్రి లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గత మంగళవారం కూడా అక్రమంగా మట్టి తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినప్పటికీ మట్టి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం

భగత్‌నగర్, జూన్ 14: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించాలని, ఆర్టీసీ డ్రైవర్లకు అనుభవజ్ఞులైన డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. ప్రతి త్రైమాసికంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందించడంతో డ్రైవర్లకు ఉత్తేజం కలుగుతుందన్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జోన్‌కు ఎంతో చరిత్ర ఉందని, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. సిబ్బంది కృషి ఫలితంగానే సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఎంతో పేరు వచ్చిందన్నారు. కరీంనగర్ జోన్‌కు ప్రతి రోజు 5.05 కోట్లు లక్ష్యం కాగా ప్రతిరోజు 5.14 కోట్లు ఆర్జిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో డీలక్స్ ఆపై సర్వీసులలో ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు కృషి చేయాలన్నారు. ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో బస్సులను నడిపించాలన్నారు. సెల్‌ఫోన్ వాడరాదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. రీజినల్ మేనేజర్ సుచరిత మాట్లాడుతూ ఉత్తమ ప్రతి కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు గ్యారెజీ సిబ్బంది సూపర్‌వైజర్లకు ప్రగతిచక్ర అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అవార్డులు సాధించిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. 3వ త్రైమాసికంలో 60 మంది ఉద్యోగులకు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ వార్డెన్స్ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్లు, వెల్‌ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ప్రభుత్వ అంధుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను 1 నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, 1 నుంచి పదో తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాబోధన చేయడంతో పాటు ఉచితంగా భోజన వసతి కూడా కల్పిస్తామని చెప్పారు. అలాగే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్, వివిధ కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలు ఈ పాఠశాలలో ప్రవేశం తీసుకోవచ్చని అన్నారు. మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో 40 నుంచి 100శాతం అంధత్వం కలిగిన విద్యార్థులకు మాత్రమే అర్హత ఉంటుందని తెలిపారు. కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన అంధ విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కోరారు. ఇతర వివరాలకు ఫోన్: 9494317315, 9701190124, 7396206959, 944033 8424 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య

సుల్తానాబాద్, జూన్ 14: సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన అమానుషమైన ఘటన చోటుచేసుకుంది. సుల్తానాబాద్-కాట్నపల్లి మధ్య రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ఓ రైస్‌మిల్లులో పని చేయడానికి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన చెందిన దంపతులు వారం రోజుల క్రితం వచ్చారు. వారికి ఆరేళ్ల, ఏడాది వయస్సుగల ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. గురువారం రైస్‌మిల్లుకు చెందిన లేబర్ రూముల్లో కరెంట్ పోవడంతో ఉక్కపోత భరించలేక తమ ఇద్దరు చిన్నారులతో సహా గది ముందు భాగంలో నిద్రపోయారు. కొంతసేపటి తర్వాత తమ పెద్ద కూతురు కనిపించకపోవడంతో చిన్నారి తల్లి విషయాన్ని భర్తకు తెలిపింది. అతడు మిల్లులోని తోటి కార్మికులతో కలిసి మిల్లుతోపాటు చుట్టుపక్కల వెతుకుతూ డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి చిన్నారిని భుజాన వేసుకుని వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అప్పటికే పోలీసులు గాలిస్తుండగా చిన్నారి అపహరణకు గురైన మిల్లును ఆనుకుని ఉన్న మరో మిల్లులో తెల్లవారుజామున దుస్తులు ఉతుకుతూ ఓ కార్మికుడు కనిపించాడు. కార్మికులు, పోలీసులు అతడిని విచారించడంతో నిందితుడని తేలింది. అతడు ఈనెల 6న మిల్లులో పనికి చేరాడని తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా, మిల్లు వెనక వైపు చెట్ల పొదల్లో అత్యాచారం చేసి, హత్య చేసినట్లు తేలిపాడు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● ఘటనా స్థలానికి పోలీస్ ఉన్నతాధికారులు

చిన్నారిపై అత్యాచారం, హత్య చేసిన కేసుకు సంబంధించిన ఘటనా స్థలాన్ని రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉన్నతాధికారులు పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు సుల్తానాబాద్‌కు చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● నిందితుడి అరెస్టు

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుడు హమాలీగా పని చేస్తున్నాడని పేర్కొన్నారు. గురువారం రాత్రి కరెంట్ పోవడంతో నేరస్థుడు బయటకు వచ్చి బాలిక, తల్లిదండ్రులు రూమ్ బయట పడుకున్న విషయాన్ని గమనించాడన్నారు. చిన్నారిని అక్కడి నుంచి ఎత్తుకెళ్లి రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో అత్యాచారం చేసి చంపి పారిపోయాడని పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

మూగ యువతిపై అత్యాచారం

సంఘటనాస్థలిని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలోని ఓగ్రామంలో మూగ యువతి (21)పై అత్యాచారం జరగగా, సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై చిర్ర సతీష్ కుమార్ పరిశీలించి నిందితుడిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వికలాంగురాలైన యువతిని తీసుకుని శ్రీనివాస్ అనే యువకుడు పనుల నిమిత్తం గొల్లపల్లి మండల కేంద్రానికి తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు.

ఈ క్రమంలో గోవిందుపల్లె రెవెన్యూ శివారులోని ఓ మామిడితోటలోకి యువతిని బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాధిత యువతి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిన చెట్లు - లేచిపోయిన రేకుల షెడ్లు


జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపైకి వంగిన చెట్టు

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలో భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన శుక్రవారం బీభత్సంను సృష్టించింది. సుమారు గంటపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో ఈదురుగాలుల తాకిడికి చెట్లు నేలకు విరిగిపడగా, పలువురు నిరుపేదలకు చెందిన రేకుల షెడ్లు కొట్టుకుపోయి నిరాశ్రయిలయ్యారు. పలుచోట్ల చెట్లు రోడ్డు విరిగిపడ్డంతో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. మరికొన్ని చోట్ల రోడ్ల పై చెట్టు విరిగిపడ్డంతో వాహనాదారులకు ప్రమాదభరితంగా మారాయి. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా, మండలంలో తొలకరి పలకరింపుతో రైతన్నల మోము పులకరించింది. వేసవి కాలం భానుడి భగభగలతో, తీవ్ర ఉక్కపోతతో సతమైన జనం ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో జనాలకు ఉపశమనం లభించినట్లయింది.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్, మరిగడ్డ, నర్సింగాపూర్, మూడపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఎనగల్, మూడపల్లిలో భారీ వర్షం కురిసింది. గాలివానకు పలు చోట్ల రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి.

పిడుగుపాటుకు గేదె మృతి..

మండలంలోని ఎనగల్ గ్రామంలో పాడి రైతు పకిడే రాజయ్యకు చెందిన గేదే పిడుగుపాటుకు మృతి చెందింది. ఎల్లమ్మ ఆలయ సమీపంలోని చెట్టు వద్ద గేదెని కట్టివేయగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ దాదాపు రూ. 50 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి, శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలి వీయటంతో మండలంలోని సండ్రల్లపల్లి గ్రామానికి చెందిన మర్రిపల్లి శంకర్ పశువుల కొట్టం కూలింది, పైకప్పు లేచి పక్కన ఉన్న ఇంటిపై పడింది. దీంతో ఇంటిలోని చిందరవందరగా మారాయి. సుమారు రెండు లక్షల రూపాయల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బీర్‌పూర్,జూన్ 14: మండల కేంద్రంలోని రోళ్ల వాగు సమీపంలో శుక్రవారం సగం కాలిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయ్యింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆనవాళ్ల కోసం చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం సగానికిపైగా కాలిపోయి ఉండటంతో వ్యక్తి ఎవరు అనేది గుర్తించడం కష్టంగా మారింది. గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని కాల్చి ఉంటారా లేదా ఎవరైనా ఆత్మహత్య కు పాల్పడి ఉంటారా అన్నసందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

పాలకుర్తి,జూన్ 14: మండలం పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన పుట్ట రంజిత్‌పై కేసు నమోదైంది. ఇటీవల రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌పై, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో రంజిత్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని భూతగడ్డల రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పుట్ట రంజిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

గ్రానైట్ క్వారీ వద్ద వృద్ధుడి అనుమానాస్పద మృతి

● మృతదేహంతో గ్రామస్థుల ఆందోళన

● రూ.6లక్షలు చెల్లించిన క్వారీ యాజమాన్యం

మల్యాల, జూన్ 14: మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులో గల గ్రానైట్ క్వారీ వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రానైట్ క్వారీ వద్ద మృతదేహంతో గ్రామస్థులు ఆందోళన చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్వంతాపూర్‌కు చెందిన నెలబొయిన పర్శయ్య(65) గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు రాగా అతని మృతదేహం గ్రామశివారులోని మారుతీ గ్రానైట్ క్వారీ వద్ద శుక్రవారం వేకువజామున కొందరు గుర్తించారు. దీంతో అక్కడి సిబ్బంది మృతి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు వృద్ధుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో ఓపెన్ బ్లాస్టింగ్‌తో రాళ్లు ఎగిరిపడడంతోనే మృతి చెందాడని బ్లాసింగ్ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్థులు మండిపడ్డారు. మృతదేహాన్ని బట్టి చూస్తే క్వారీలో జరిగిన ప్రమాదమేనని మృతుడి కుటుంబసభ్యులను ఆదుకోవాలని గ్రామస్థులు నక్క అనిల్, రమేష్ డిమాండ్ చేశారు. క్వారీ వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో దాదాపు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి అక్క డకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్థుల ఆందోళన నేపథ్యంలో క్వారీ యాజమాన్యం మృతుడి కుటుంబసభ్యులకు ఆరు లక్షల రూపాయలు చెల్లించ డంతో ఆందోళన విరమించినట్లు గ్రామస్థులు తెలిపారు. పర్శయ్య కొడుకు నరేష్ తన తండ్రికి కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగా లేదని అందులో భాగంగానే గురు వారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లగా క్వారీ వద్ద తలపై బండ పడడంతో గాయాలై మృతి చెందాడని తమకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు జగిత్యాలకు తరలించారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

బేగంపేట్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు

రామగిరి, జూన్ 14: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గుడుంబా స్థావరాల పై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపట్టారు. రామగుండం సిపి ఆదేశాల మేరకు గ్రామ శివారులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడంబా స్థావరాలను గుర్తించారు. స్థావరాల్లోని వెయ్యి లీటర్లబెల్లం పానకం, సామాగ్రిని ధ్వంసం చేశారు. సీఐ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వంలో నేరారోపణలు ఉన్న మంత్రులు ఉండడం దారుణం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, జూన్ 14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంలో ఇటీవల నియమించిన కేంద్ర మంత్రుల్లో నేరారోపణలు ఉన్న వారు ఉండడం దారుణమ ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది అనేక అత్యాచారాలు, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, ఇతర క్రిమినల్ కేసుల్లో 259 మంది నేరారోపణలు ఉన్నవారు ఎన్నికల్లో గెలిచారన్నారు. ప్రస్తుతం 18 మంది కేంద్ర మంత్రులు కూడా నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దేశంలో మోదీ సొంత పాలన చేస్తూ 750 మంది రైతులను బలి తీసుకున్నారని ఆరోపించారు. అనేక ఉద్యమాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసిన నియంత మోదీ అని ఆన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ ప్రకారం దేశ ప్రజలకు పాలన అందించి అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్వమించిన విధంగా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ప్రజల మన్నలను పొందేలా కృషి చేయాలని అన్నారు. ప్రజాదార్బర్ ద్వారా ప్రజలతో, పాటు నాయకులను కలిసి అనేక ప్రజా సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, ముద్రకోల రాజయ్య, తెరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, కంది రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక 'విద్యుత్ ప్రజావాణి'

- ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చూస్తామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్స్యూమర్ రిసెప్షెన్ డెస్క్‌ల కు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామని సీఎండీ వెల్లడించారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 14: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 130క్వింటాళ్లు విడి పత్తి, ముగ్గురు రైతులు రెండు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 15,16న సాధారణ సెలవు దినాలు కాగా, 17న బక్రీద్, 18న ఉర్సు ఉత్సవాల జాతర సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించడం జరిగిందని, తిరిగి బుధవారం కొనుగోళ్ల ప్రారంభం అవుతాయని తెలిపారు.

వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభం

అంతర్గాం, జూన్ 14: రామగుండం పట్టణంలోని అంగడి బజార్ ఏరియాలోగల బీసీ బాలికల వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభించినట్టు సంక్షేమాధికారి వై భారతి తెలిపారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరు 60సీట్లు ఖాళీలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇందులో బీసీకలు 40సీట్లు, ఎస్సీలకు 10, ఎస్‌టీలకు 5, ఇతరులకు 5 సీట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్ కార్డు, స్టడి సర్టిఫికెట్, కులం, ఆదాయ ధ్రువపత్రాలు జిరాక్స్‌లు తీసుకువచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు వసతి గృహ సంక్షేమాధికారి సెల్ నెం. 8019959096, 9676899096 సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామగిరి, జూన్ 14: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. శుక్రవారం మండలంలోని బేగంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో శైలజ రాణితో కలసి పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగుల పరామర్శించారు. వర్షకాలంలో వాతవరణం కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిందిగా సూచించారు. వివిధ రకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నా గ్రామంలో తక్షణం నియంత్రణకు చర్యలు చేపట్టాలని డాక్టర్ ప్రదీప్‌కు కోరారు.

మిషన్ భగీరథ కనెక్షన్లపై ఆరా

ముత్తారం జూన్ 14: మండలంలోని ఇప్పలపల్లి, సీతంపైట, ఖమ్మంపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ లలిత మిషన్ భగీరథ నల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి ట్యాంకుల నుండి సకాలంలో నీరు వస్తుందా లేదా ప్రతిఇంటికి నల్లాలు అమర్చరా అని అరా తీశారు. కార్యక్రమంలో ఎంపీఓ వేణుమాధవ్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కమాన్‌పూర్, జూన్ 14 : మండలంలోని రొంపికుంట గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగుపల్లేలో ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చొప్పరి శంకర్ పూరి గుడిసె కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో అకస్మాతుగా షార్ట్‌సర్క్యూట్ మూలంగా ఇంట్లోని రూ. లక్ష 50 వేల నగదుతో పాటు ఇంటి సామగ్రి, విలువైన పత్రాలు దగ్ధమయ్యాయి. నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా, రెవెన్యూ అధికారులు ఘటనపై పంచనామా చేశారు.

గాలివానకు రైస్ మిల్లుల పైకప్పులు ధ్వంసం

సుల్తానాబాద్, జూన్ 14: ఈదురుగాలితో కూడిన వార్షానికి సుల్తానాబాద్ రైస్ మిల్లుల ప్రాంతంలోని పలు మిల్లులకు సంబంధించిన పైకప్పులు బుధవారం రాత్రి ధ్వంసం అయ్యాయి. మిల్లుల రేకులు ఎగిరిపోయాయి. ఐరన్ పోల్స్ మిషనరీపై పడడంతో యంత్రాలు పాడయిపోయాయి. రేకులు ఎగిరిపోవడంతో మిల్లులో ఉన్న ధాన్యం చాలా వరకు తడిసింది. అలాగే గాలికి రాజీవ్ రహదారి పక్కనున్న చెట్లు విరిగి పడిపోయాయి. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడగా, స్తంభాలు పడిపోవడంతో సరఫరా కూడా నిలిచిపోయింది.

కండీషన్ లేని వాహనాలతో ఇబ్బందులకు గురి చేయవద్దు

- డీజిల్‌లో కోత పెట్టడం సరికాదు - కమిషనర్‌కు కార్పొరేషన్ డ్రైవర్ల విజ్ఞప్తి - పాత పద్ధతిలోనే డీజిల్ పోసేందుకు అంగీకారం



కమిషనర్‌తో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు, డ్రైవర్లు

కోల్‌సిటీ, జూన్ 14: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో కండీషన్ లేని వాహనాలతో నానా ఇబ్బందులు పడుతున్నామని, అవి మైలేజీ రావడం లేదంటూ మమ్మల్ని ఇబ్బంది పెట్టడం సరికాదని నగరపాలక సంస్థ అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు కమిషనర్‌కు విన్నవించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో డ్రైవర్లు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌ను కలిసి మాట్లాడారు. ట్రాక్టర్లు సుమారు 20ఏళ్ల క్రితం కొనుగోలు చేసినవని, వాటి జీవితకాలం కూడా పూర్తయ్యిందన్నారు. 18 ఏళ్లుగా ఆయిల్ మార్చలేదని, కనీసం ఆయిల్ ఫిల్టర్లు కూడా మార్చే పరిస్థితి లేదన్నారు. ట్రాలీలు కండీషన్‌లో లేవన్నారు. ఈ పరిస్థితుల్లో డీజిల్, పెట్రోల్‌లో కోత పెడుతున్నారన్నారు. 20లీటర్లే పోయడం వల్ల వాహనాలు మధ్యలో ఆగిపోతున్నాయని, డ్రైవర్లను బాధ్యులను చేసి డ్యూటీలు నిలుపుదల చేస్తున్నారన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ పాత పద్ధతిలోనే వారానికి 24లీటర్లు డీజిల్ పోస్తామని, సేవలు అందించడంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. కమిషనర్‌తో చర్చించిన వారిలో యూనియన్ నాయకులు మురళీధర్‌రావు, కిషన్ నాయక్, మంద రాములు, చిలుముల రమేష్, నర్సయ్య ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



విద్యార్థులతో అక్షరాలు దిద్దిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. శుక్రవారం పట్టణంలోని అమర్‌నగర్ యూపీఎస్‌లో ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేయడంతోపాటు రీడింగ్ కార్నర్ రూమ్‌ను, తరగతి గదులలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పి ప్యానెల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నిర్వీర్యమైన ప్రభుత్వపాఠశాలలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం 1100కోట్లు ఖర్చుచేసి అవసరమైన అన్ని వసతులు విద్యార్థులకు కల్పించామన్నారు. పాఠశాలలో గ్రంథాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మంచి పుస్తకాలు కొనుగోలు చేసి విద్యార్థుల కోసం అందించేందుకు 10 వేల రూపాయలను సొంతనిధుల నుంచి విరాళం ప్రకటించారు. అనంతరం పాఠశాలలో కొత్తగా చేరిన పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. డీఈవో మాధవి, ఎంఈవో సురేందర్, హెచ్ఎం మంజులత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్, పంచాయతీ సెక్రెటరీ, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో ఉద్యమించాలి : ఎస్ఎఫ్ఐ

పెద్దపల్లి రూరల్, జూన్ 14 : చేగువేరాస్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లెల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అర్ల సందీప్ చేగువేరా చిత్రపటానికి పూల వేసి నివాళ్లు అర్పించారు. జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్, నాయకులు గద్దల సిద్ధార్థ, నవీన్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

సుల్తానాబాద్, జూన్ 14: మండలంలోని గర్రెపల్లి మాడల్ స్కూల్ విద్యార్థులు సాక్షిత్, విజయ చేతనలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అవార్డుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు గన్నేరువరం శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

ఓదెల, జూన్ 14 : మండలంలోని పొత్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదువుతున్న కండెం వైష్ణవి, ఫాసియా తబస్సుమ్ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను శుక్రవారం హైస్కూల్లో ఉపాధ్యాయ బృందం అభినందించారు.



ట్రాన్స్‌జెండర్ల వైద్య చికిత్స గదిని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందు

ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక వైద్య సేవలు

కళ్యాణ్‌నగర్, జూన్ 14: ట్రాన్స్‌జెండర్ల కోసం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్టు సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ చెప్పారు. శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జండర్లకు అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో వారి కోసం 39వ గదిలో ప్రత్యేకంగా వైద్య సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. ట్రాన్స్‌జండర్లు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, ఏవైనా ఆపరేషన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చినా వైద్యులను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఈ అవగాహన కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్ శంకర్, పల్లెర్ల రమేష్ పాల్గొన్నారు.



విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన



ఆర్జీ-2 అధికారులతో చర్చిస్తున్న డీఎంఎస్(ఎలక్ట్రికల్)

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: విద్యుత్ ప్రమాదాల నివారణపై రాజీవ్‌వర్మ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ (సౌత్ జోన్) ఆర్జీ-2 ఏరియా అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎలక్ట్రికల్ ప్రమాదాలకు కారణాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇటీవల ఓసీపీ-3లో జరిగిన ఎలక్ట్రికల్ ప్రమాదాన్ని ఉదహరిస్తూ భవిష్యత్తులో అటువంటివి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రక్షణ పరికరాలు, పని స్థలాల్లో విద్యుత్ కనక్షన్ల వంటివాటిపై వివరించారు. ఈ సమావేశంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, రామగుండం రీజియన్ జీఎం సేఫ్టీ కేహెచ్ఎస్ గుప్తా, ఓసీపీ-3 పీఓ మధుసూదన్, వీకేపీ గని ఏజంట్ శ్రీనివాసరెడ్డి, ఎస్వోటూ జీఎం వెంకటేశ్వరరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బచ్చ రవీందర్, అధికారులు నరసింహారావు, రాజాజీ, ఎర్రన్న, రమేష్‌తో పాటు ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

గోదావరిఖని, జూన్ 14: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో పని చేస్తున్న వెంకటేశ్వర్లు అనే కార్మికుడు గాయపడ్డాడు. ఎడమ చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో మొదటి షిఫ్టులో పని ముగింపు సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంకటేష్‌ను గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గత 15రోజులుగా జీడీకే 11ఇంక్లైన్‌లో వరుస ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేలంలో పాల్గొనేలా యాజమాన్యాన్ని ఒప్పించాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: కొత్త గనులను దక్కించుకునేలా కేంద్రం నిర్వహి స్తున్న బొగ్గు బ్లాకల వేలంలో సింగరేణి పాల్గొనేలా యాజమాన్యాన్ని ఒప్పించినట్టు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ-3 కృషి భవన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న ప్రభుత్వం కొత్త గనులు ప్రారంభించలేక పోయిందని, సంస్థ భవిష్యత్తుకు కొత్త గనులు రావాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. వేలంలో పాల్గొనడం ద్వారా రాష్ట్ర పరిధిలోని గనులను సింగరేణి దక్కించుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. గుర్తింపు సంఘం లెటర్ ఆలస్యం కావడంతో చర్చలకు ఆస్కారం లేని కారణంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదనే విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్టు సీతారామయ్య తెలిపారు. పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్, సొంత ఇంటి పథకం, ఎస్-1 రద్దు చేసి పాత పద్ధతిలోనే స్లైడేలు, పీహెచ్‌డీలు ఇవ్వడం, మారు పేర్లతో ఉన్న కార్మికుల పేర్ల మార్పు,సీఎంపీఎఫ్ చిట్టీలు ఇప్పించడం ప్రధాన సమస్యలని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం 29 వేల కోట్ల బకాయిలీను ఇచ్చేలా చర్చించనున్నట్టు తెలిపారు. గడిచిన వార్షిక సంవత్సర లాభాలను ప్రకటించి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని సీతారామయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డిపెండెంట్ల వయస్సు 35 నుండి 40కి పెంచేలా యాజమాన్యాన్ని ఒప్పించినట్టు తెలిపారు. ఏఐటీయూసీ కృషి ఫలితంగా పరిష్కారం అయిన సమస్యలను ఇతర కార్మిక సంఘాల నాయకులు తామే సాధించినట్టు ప్రచారం చేసుకుంటున్నారని, పెండింగ్ సమస్యలు ఏఐటీయూసీ కారణంగా పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. యూనియన్లకు అతీతంగా కార్మికులందరి సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ కృషి చేస్తుందని అన్నారు. ఈ గేట్ మీటింగ్‌లో యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ ప్రకాష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, నాయకులు రాజారత్నం, జూపాక రాంచందర్, జీ రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, శ్యాంసన్, సాంబశివరావు, ఎస్ వెంకటేశ్వర్లు, రవికుమార్, మహేందర్ పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: ఆర్జీ-2 సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి యాజమాన్యం సర్టిఫికెట్లను అందజేసింది. శుక్రవారం కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ-2 సేవా అధ్యక్షురాలు మాలతీ సూర్యనారాయణ, జీఎం సూర్యనారాయణలు హాజరయ్యారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల లో 271 మంది శిక్షణ పొందారని, ఖదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ నిర్వహించిన పరీక్షలకు 180 మంది హాజరైనట్టు సేవా అధ్యక్షురాలు తెలిపారు. ఈసర్టిఫికెట్లతో మహిళలు స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని అన్నారు. బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాకండా ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం, పరిసర ప్రభావిత గ్రామాల యువత, మహిళలకు వృత్తి నైపుణ్యత పెంపొందించేలా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారులు రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, ఎస్ఎస్ఓ మహమ్మద్ షరీఫ్‌తో పాటు ఫ్యాకల్టీ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈపీ ఆపరేటర్ పరీక్షలు

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు



సమావేశంలో జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూన్ 14: రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో ఈనెల 18న రెండు రోజుల పాటు నిర్వహించే ఈపీ ఆపరేటర్ ప్రాక్టికల్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఆర్జీ-3 జీఎం అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల భర్తీకి సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన మాట్లాడారు. ఆర్జీ-2,3, ఏపీఏ డివిజన్‌లలో 332 మంది ఈపీ ఆపరేటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న అంతర్గత కార్మికులకు హాల్ టికెట్స్ జారీ చేయడం జరిగిందన్నారు. ఈనెల 18 నుంచి రెండు రోజులు స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరుకావలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పరీక్షకు హాజరుకావాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు రఘుపతి, వెంకటరమణ, రాజేందర్, చంద్ర శేఖర్, పద్మారాజు, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నాగరాజు, కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం : ఐఎన్‌టీయూసీ

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు సంస్థ అభివృద్ధికి ఐఎన్‌టీయూసీ కట్టుబడి ఉన్నదని యూనియన్ సెంట్ర ల్ కమిటీ సభుడు గడ్డం తిరుపతి పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ -1 సైటాఫీస్‌లో కార్మికులను కలసి ఆయన మాట్లాడారు. 35 శాతం లాభాల వాటా ఇప్పించేలా యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కృషి చేస్తున్నట్టు తెలిపారు. గృహ నిర్మాణం లేదా ఇల్లు కొనుకునే కార్మికులు లోను దరఖాస్తు చేసుకున్న ఏడాదిలోపు ఇల్లు కొన్నా, నిర్మించుకున్న వారికే లోను సంబంధించిన వడ్డీ యాజమాన్యం చెల్లిస్తున్నదని, దీంతో వివిధ కారణాలతో ఇంటి నిర్మాణం ఆలస్యం అయిన కార్మికులే వడ్డీ చెల్లించాల్సి వస్తున్నదని తిరుపతి పేర్కొన్నారు. గృహరుణ దరఖాస్తు కార్మికులందరికి వడ్డీ చెల్లించేలా సర్క్యులర్‌లో సవరణ చేయించినట్టు పేర్కొన్నారు. బ్యాంకులు 8.33 శాతం వడ్డీతో గృహ నిర్మాణ రుణాలను ఇస్తున్నాయని, కానీ యాజమాన్యం మాత్రం 6.7 శాతం వడ్డీ చెల్లిస్తుండడాన్ని జనక్‌ప్రసాద్ సీఎండీతో చర్చించి బ్యాంక్ వడ్డీలు ఎంత ఉంటే అంత చెల్లించేలా ఒప్పించినట్టు గడ్డం తిరుపతి పేర్కొన్నారు. గడ్డం తిరుపతి వెంట పిట్ సెక్రెటరీ వెంకటస్వామి, కొలిపాక సారయ్య, ప్రవీణ్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, శ్రీనివాస్, వినయ్, సతీష్‌కుమార్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

ఎలిగేడు, జూన్ 14: నిరుపేద కుటుంబానికి చెందిన కట్ల రాజమౌళి, ఇటీవల మృతి చెందడంతో జిల్లా పద్మశాలి సేవా సంఘం అడ్‌హాక్ కమిటీ చైర్మన్ వల్స నీలయ్య ఆధ్వర్యంలో బాధిత కుటంబానికి 50కిలోల బియ్యాన్ని అందించారు. శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కమిటీ సభ్యులు మామిడాల రమేష్, పెగడ చందు, ఆడెపు అంబదాస్, గాదాసు రవీందర్, బూర్ల సత్యనారాయణ, కొండ సత్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు బూర్ల సత్యనారాయణ, దేవసాని వీరేశం పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె పరీక్ష శిబిరం

ఎలిగేడు, జూన్ 14:మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ నెల 16న ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు నీలయ్య తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారుడికి టీషర్ట్ పంపిణీ చేసిన దుద్దిళ్ల శ్రీను

మంథని, జూన్ 14: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంథని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడారంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు టీ షర్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, ముస్కుల సురేందర్‌రెడ్డి, పోలు శివ, గోటికార్ కిషన్‌జీ, నూకల బానయ్య ఉన్నారు.

కేశోరాం ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

పాలకుర్తి,జూన్ 14: ఈ నెల 18న జరగనున్న కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో ప్రధానకార్యదర్శులుగా పోటీచేస్తున్న అభ్యర్థులకు శుక్రవారం ఎన్నికల అధికారి బద్దం డానియల్ గుర్తులను కేటాయించారు. ప్రధాన కార్యదర్శి అభ్యర్థులైన కల్వ నరేష్‌కు చేతిలో చెయ్యి గుర్తు, మాదాసు శ్రీనివాస్‌కు మోటర్ సైకిల్ గుర్తు, నగునూరి రమేష్‌కు ఆటో గుర్తు, పొనవేని సదయ్యకు ధర్మచక్రం గుర్తులను కేటాయించారు. ఆయా గుర్తులతో, బ్యాలెట్ నమూనా పత్రాలతో వారు మద్దతుదారులతో కలిసి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఆమె కళ్లు సజీవం

పాలకుర్తి,జూన్ 14: మండలం పరిధిలోని కన్నాల బోడగుట్టకు చెందిన పోలు శాంతమ్మ శనివారం మృతి చెందింది. సదాశయ ఫౌండేషన్ మండల అధ్యక్షుడు బీమనపల్లి పృధ్విరాజ్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా ఆమె నేత్రాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఎల్వీ ప్రసాద్ టెక్నీషియన్ నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు పంపించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని శాంతమ్మ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుకు స్పందించిన అధికారులు

పాలకుర్తి,జూన్ 14: మండల పరిధిలోని బామ్లానాయక్ తండాకు చెందిన శంకర్ నాయక్‌తో పాటు పలువురు యువకులు ఇటీవల పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన మండల ఎంపివో షబ్బీర్ పాషా శుక్రవారం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో ఓ వ్యక్తి కోళ్ల ఫారం నిర్వహించడంతో ఆ దుర్వాసనకు తమ గ్రామంలోని పలువురు అనారోగ్యాల భారిన పడుతున్నారని గ్రామస్థులు ఎంపివోకు వివరించారు. పూర్తి సమాచారం సేకరించి తదుపరి విచారణ చేపట్టనున్నట్లు ఎంపీవో తెలిపారు. కార్యక్రమంలో మూడ్ శివకుమార్ నాయక్, ఇస్లావత్ రాజేష్, బధావత్ రాజేష్, బధావత్ అంజి నాయక్, బానోత్ జయ్‌పాల్, బధావత్ బాలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

పెద్దపల్లి రూరల్, జూన్ 14: మండలంలోని కాపులపల్లిలో గ్రామస్థులంతా తమ ఉదారతను చాటుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎస్ కె రాజ్‌మహమ్మద్ గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబం ఆర్థిక కష్టాలు ఎదురుకాకుండా గ్రామస్థులంతా విరాళాలు సేకరించి రూ.33,500 మృతుని కుటుంబానికి అందజేశారు. గ్రామస్థులంతా కాపులపల్లి పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా కూడా ఒకేతాటిపై నిలిచి అండగా ఉంటున్నారు. ఇందులో భాగంగా ఆర్థికంగా చితికిపోయిన రాజ్ మహ్మద్ మృతిచెందడంతో అదే వాట్సాప్ గ్రూప్‌లో చర్చించుకుని తోచిన తీరు విరాళాలు సేకరించి మృతుని కుటుంబానికి అండగా నిలిచారు.

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి



బ్రాహ్మణపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, జూన్ 14: మండలంలోని మిషన్ భగీరథ సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, అప్పన్నపేట గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా మిషన్ భగీరథ సర్వేను నిర్వహిస్తుండగా ఎంపీవో సుదర్శన్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్, శ్రీనివాస్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అక్షరాభ్యాసం

పెద్దపల్లి రూరల్, జూన్ 14 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. జయశంకర్ బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులంతా పాఠశాలల్లో నూతనంగా చేరిన నర్సరీ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. గౌరెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యాయులు భారతి, మేరి, వీవో వసంత, అంగన్‌వాడీ టీచర్ శకుంతలలతో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ శకుంతల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

డ్రమ్ సీడర్‌పై రైతులకు అవగాహన

రామగిరి, జూన్ 14: మండలంలోని రత్నాపూర్ కెవికెలో డ్రమ్ సీడ్ విధానం వల్లే కలిగే ప్రయోజనాలపై కెవికె శాస్త్రవేత్తలు భాస్కర్‌రావు, వెంకన్న, కిరణ్, వినోద్‌లు రైతులకు వివిధ అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కెవికె ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా డ్రమ్ సీడ్ విధానాన్ని అమలు చేస్తూ గణనీయమైన దిగుబడులు సాధిస్తున్నారని శాస్త్రవేత్తలు తెలిపారు. కొన్ని దత్తత గ్రామాలకు డ్రమ్ సీడర్ యంత్రాలను పంపిణీ చేశామన్నారు. డ్రమ్ సీడర్ సాంకేతికత, పనిచేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. ఈ అవగాహన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో రైతులు హాజరయ్యారు.

సబ్బితం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

పెద్దపల్లి రూరల్ , జూన్ 14 : పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ ఎన్నికల సమయంలో ఒక పార్టీకి మద్దతు తెలిపారని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కందుల అశోక్ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం ఏపీడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్నికల కోడ్ సమయంలో ఉపాధి హామీ పనుల వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతు తెలిపాడని, ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని కందుల అశోక్ ఫిర్యాదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, కందుల అశోక్ నుంచి వివరణ తీసుకుని నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఏపీడీ సత్యనారాయణ తెలిపారు. ఈ విచారణలో గ్రామ ప్రత్యేకాధికారి, ఏపీవో రమేష్, టిఏ దివ్య, కార్యదర్శి రవి పాల్గొన్నారు.